సాక్షి
నల్లగొండ
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



తక్కెళ్లపహాడ్‌లో ఉద్రిక్తత
శాలిగౌరారం మండలం తక్కెళ్లపహాడ్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. - 8లో



29న మంత్రి కేటీఆర్ రాక
అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు 29న మంత్రి కేటీఆర్ నకిరేకల్ నియోజకవర్గానికి రానున్నారు. - 8లో



కేసీఆర్‌తోనే అభివృద్ధి
సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు మద్యం షాపులు బంద్

నల్లగొండ క్రైం : జిల్లాలో వినాయక శోభాయాత్ర, నిమజ్జనాల సందర్భంగా పలు మద్యం షాపులను మూసి వేస్తున్నట్లు కలెక్టర్ కర్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో, మున్సిపాలిటీలకు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న మద్యం షాపులను బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు.

3.8 మి.మీ వర్షం

నల్లగొండ అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో 3.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా కేతేపల్లి మండలంలో 22.2 మిల్లీమీటర్లు, మర్రిగూడ 21.7, మునుగోడు 19.6, తిప్పర్తి 10.2, నార్కట్‌పల్లి 0.9, కట్టంగూర్ 5.7, నకిరేకల్ 5.4, నల్లగొండ 8.2, చండూరు 0.8, చింతపల్లి 0.8, నాంపల్లి 2.7, గుర్రంపోడు 2.2, అనుముల హాలియా 0.3, త్రిపురారం 1.8, మాడుగులపల్లి 0.4, వేములపల్లి 0.7, దామరచర్ల 0.7, పెద్దవూర 0.8, పీఏపల్లి 3.8, కొండమల్లేపల్లి 3.3, దేవరకొండ 0.3, డిండి, గట్టుప్పల 1.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఆకస్మిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న సరోజినీదేవి

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలను ఆదర్శ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీ దేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థుల నమోదు తక్కువగా ఉందని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గ్రంథాలయానికి పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం, సరోజిని దేవి కుసుమాలు పుస్తకాన్ని బహూకరించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ డి.సుజాత, ఎంఈఓ సామ్యనాయక్ పాల్గొన్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.57,15,100



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు విచ్చేసి స్వామి వారికి 92 రోజుల్లో సమర్పించిన కానుకల హుండీలను మంగళవారం లెక్కించారు. రూ.57,15,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. అన్నదానం హుండీ ఆదాయం రూ.97,900 వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.మహేంద్రకుమార్, పరిశీలకురాలు వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంటు ఇంద్రసేనారెడ్డి, రేగట్టె రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నల్లగొండ టౌన్ : గ్రామ పంచాయితీ కార్మికులు 34 రోజుల సమ్మె చేపట్టిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ చిన పాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జేఏసీ పిలుపు మేరకు ర్యాలీని నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామని అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోతెపాక వినోద్‌కుమార్, చింతపల్లి బయ్యన్న, పొన్న అంజయ్య, నడుకుల నర్సింహ, సర్వయ్య, ఎండీ.జహీర్, ఎర్పుల సైదులు, కె.మంగారెడ్డి, ఇరిగి ఎల్లేష్, ఎరగాని లింగయ్య, కోటయ్య పాల్గొన్నారు.

ఆగని అసంతృప్తులు

బీఆర్‌ఎస్ పార్టీకి పలుచోట్ల ఆశావహులతో తంటా

- కొన్ని చోట్ల తిరుగుబాటు.. మరికొన్ని చోట్ల ప్రతిపక్ష పార్టీలతో చెట్టాపట్టాల్
- గుంభనంగా గులాబీ పార్టీ అధినాయకత్వం
- అంతుచిక్కని అధిష్టానం అంతరంగం
- టికెట్‌పై సిట్టింగుల్లోనూ పెరుగుతున్న ఆందోళన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అధికార బీఆర్‌ఎస్ పార్టీలో అసంతృప్తులు ఆగడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు, అసంతృప్తుల మధ్య ఫైట్ కొనసాగుతూనే ఉంది. కనీసం వారిని బుజ్జగించే చర్యలు కూడా కనిపించకపోవడంతో ఎవరి ప్రచారంలో వారు మునిగారు. అధికార పార్టీలోనే ఉంటూ తిరుగుబాటు జెండా ఎగురవేసిన అసంతృప్తులు బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ కొన్ని చోట్ల అభ్యర్థులను మార్చాలని డిమాండ్ చేస్తుండగా, మరికొన్ని చోట్ల తమకు టికెట్ ఇవ్వాలని పట్టుపడుతున్నారు. నల్లగొండ వంటి నియోజకవర్గాల్లో అధికార పార్టీ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటామంటూ ఆశావహులు తిరుగుబాటు చేస్తుండగా, ఇంకొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ రాజకీయం గందరగోళంగా మారింది.

వేచి చూసే ధోరణిలో అధిష్టానం..

నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నా బీఆర్‌ఎస్ అధిష్టానం ఇంకా వేచిచూసే ధోరణిలోనే ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిట్టింగ్‌లు పోటీలో ఉంటారంటూ అభ్యర్థుల జాబితా ప్రకటించిన నాటి నుంచి ఆశావహులు ఎవరికి వారే కార్యక్రమాలను చేసుకుంటున్నా నిలువరించిన సందర్భాలు లేవు. ఇదీ అభ్యర్థులుగా పోటీలో ఉండబోయే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ఇటు సిట్టింగ్ అభ్యర్థులు, అటు ఆశావహులు ఎవరికి వారు ప్రచారం కొనసాగిస్తుండడంతో అసలు అధిష్టానం టికెట్ ఎవరికి ఇస్తుంది? ఇప్పుడు ప్రకటించిన వారికే వస్తుందా? ఏమైనా మార్పులు ఉంటాయా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా పైకి టికెట్ తమకేనని గంభీరంగా కనిపిస్తున్నా లోలోపల వారికి ఆందోళన తప్పడం లేదని ఓ ముఖ్య నాయకుడు 'సాక్షి'తో పేర్కొనడం పరిస్థితికి అద్దం పడుతోంది.

పలు నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి..

- నల్లగొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికే అధిష్టానం టికెట్ ఇస్తామని ప్రకటించింది. అయితే పట్టణానికి చెందిన కౌన్సిలర్, బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు. తాజాగా తన ఫ్లెక్సీలు భూపాల్‌రెడ్డి వర్గం నేతలు చింపారంటూ మంగళవారం నల్లగొండలో నిరసన ర్యాలీ చేపట్టారు.
- నకిరేకల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకే టికెట్ అని అధిష్టానం ప్రకటించింది. దీంతో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయనతో మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడినా ప్రయోజనం లేకుండాపోయింది. కాంగ్రెస్‌లో చేరేందుకు ఢిల్లీకి వెళ్లి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కూడా కలిశారు.
- దేవరకొండలోనూ అసంతృప్తి చల్లారడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు టికెట్ ప్రకటించక ముందు నుంచే అయనకు టికెట్ ఇవ్వొద్దంటూ అధిష్టానానికి స్థానిక నేతలు విన్నవించారు. మంత్రి హరీశ్‌రావును కలిసి తమ వ్యతిరేకతను తెలియజేశారు. దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దేవేందర్‌నాయక్ వర్గం రవీంద్రకుమార్ అభ్యర్థిత్వాన్ని మార్చాలని డిమాండ్ చేసింది. దేవేందర్‌నాయక్ ఇటీవల తన అనుచరులతో సమావేశాలు నిర్వహించడంతోపాటు తనకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.
- నాగార్జునసాగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే నోముల భగత్‌కు అధిష్టానం టికెట్ కేటాయించింది. అయితే ఆశావహులు మాత్రం తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నారు. బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్ టికెట్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారి అనుచరులు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.
- కోదాడలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ను మార్చాలని ఆయన వ్యతిరేకవర్గం పట్టుపడుతోంది. అక్కడి పార్టీ నేతలు శశిధర్‌రెడ్డి, చందర్‌రావు ఎమ్మెల్యేతో విభేదిస్తూ తమకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు.
- ఆలేరులో నియోజకవర్గానికి చెందిన మోత్కుపల్లి నర్సింహులు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఆలేరు అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి పేరు ఖరారైన తరువాత మోత్కుపల్లికి ఉమ్మడి జిల్లాలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆయన అనుచరులు సమావేశం పెట్టి డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదెందుకో?

వివిధ నియోజకవర్గాల్లో పార్టీ నేతలు రెండు వర్గాలుగా చీలిపోతున్నా, పార్టీలో ఉండి అధిష్టానం ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేస్తున్నా, ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటున్నా.. అధిష్టానం ఎందుకు ఈ విషయంలో మిన్నకుండిపోతుందన్న దానిపైనే చర్చ సాగుతోంది. అసంతృప్తులను దారికి తెచ్చుకోవడం, లేదా పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండని వారిపై చర్యలు తీసుకోవడం వంటి కార్యాచరణను ఎందుకు అమలు చేయడం లేదన్న దానిపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సిట్టింగుల్లోనూ ఆందోళన నెలకొంది. అభ్యర్థులుగా పేర్లు ప్రకటించినా, చివరికి టికెట్ ఇస్తారా? లేదా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మరోవైపు అధిష్టానం సర్వే చేయిస్తోందని, దాని ఫలితాలు వచ్చాకే అసంతృప్తుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటుందన్న వాదనను పార్టీ వర్గాల నుంచి వస్తున్నా.. సిట్టింగ్‌లకు మాత్రం చికాకు తప్పడం లేదు.

మున్సిపల్ కమిషనర్‌తో రేపు ఫోన్ ఇన్


దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల మురుగునీరు చేరి ఇబ్బందిగా మారింది. దోమల బెడద కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య సమస్యతో పాటు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, డ్రైయినేజీ, కోతుల బెడద తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ. 28.09.2023 (గురువారం)
ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ : **91103 59838**



వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

భూ పోరాటానికి నాంది.. ఐలమ్మ



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

నల్లగొండ టౌన్ : భూపోరాటానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం చాకలి ఐలమ్మ 128వ జయంతిని పురస్కరించుకుని సాగర్ రోడ్డులో గల ఐలమ్మ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాటాలను, సేవల్ని స్మరించుకోవడానికి ఆమె జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. రజకులకు స్థలం కేటాయించి భవన నిర్మాణం, మినీ ఫంక్షన్‌హాల్ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై మహిళలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, ఎంబీసీ చైర్మన్ కొండూరు సత్యనారాయణ, ఖాజా నజీం అలీ, చెన్నయ్య, రాములు, అంజయ్య ఉన్నారు.

ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులను పరిశీలించాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లు రూట్ల వారీగా సందర్శించిన వివరాలను నియోజకవర్గాల వారీగా అడిగి తెలుసుకున్నారు. సెక్టర్ అధికారులు కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే స్థానిక పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లను సంప్రదించి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశానికి హాజరుకాని సెక్టార్ అధికారులకు ఎలక్షన్ రూల్స్ ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్డీఓ చెన్నయ్య, యూనిట్-2 దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలి



నల్లగొండలో మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మ వద్ద రోదిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నల్లగొండ టౌన్ : అంగన్‌వాడీ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె మంగళవారం 16 రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి గడియారం సెంటర్ వరకు మంత్రి సత్యవతిరాథోడ్ దిష్టిబొమ్మతో శవయాత్రను నిర్వహించి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దండెంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహ, కె.విజయలక్ష్మి, ప్రమీల, లక్ష్మి, రేణుక, కళ్యాణి, రత్నమాల, యాదమ్మ, సరిత, విజయ, జ్యోతి, రూపా, సముద్రమ్మ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



నల్లగొండలోని వల్లభరావు చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్

- నిఘానీడలో సాగనున్న శోభాయాత్ర
- డీజేలు, టపాసులు కాల్చేందుకు అనుమతి లేదు
- మద్యం తాగి ఇతరులను ఇబ్బంది పెట్టొద్దని పోలీసుల సూచన

నల్లగొండ క్రైం : జిల్లా వ్యాప్తంగా బుధవారం గణేశ్ నిమజ్జనం, శోభాయాత్ర శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేకంగా 600 మంది పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తోంది. భద్రతను పర్యవేక్షించేందుకు ఎస్పీ, ఏఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 50 మంది ఎస్సైలు, 534 మంది ఏఎస్సైలు, అదనంగా ఏఆర్ సిబ్బంది, మరో 170 మంది పోలీస్ వలంటీర్లు భద్రతలో పాల్గొననున్నారు. శోభాయాత్ర, నిమజ్జనాన్ని పర్యవేక్షించేందుకు 3977 సీసీ కెమెరాలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేశారు. నిమజ్జనం చేసే ప్రాంతాల వద్ద ఫ్లడ్ లైట్‌లు, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. శాంతియుతంగా భక్తిభావంతో శోభాయాత్ర నిర్వహించుకోవాలని ఎలాంటి రెచ్చగొట్టే చర్యలుకు పాల్పడినా సహించమని ఎస్పీ అపూర్వరావు హెచ్చరించారు.

జిల్లాలో ఏడు వేల విగ్రహాలు..

జిల్లా వ్యాప్తంగా ఏడు వేల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా.. బుధవారం ఐదు వేల విగ్రహాలను వివిధ ప్రాంతాల్లోని సమీప చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా డీజేలు పెట్టవద్దని, టపాసులు కాల్చడానికి అనుమతి లేదని పోలీస్‌శాఖ పేర్కొంది. మద్యం తాగి శోభాయాత్రలో చిందులు వేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని, చిన్న పిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమజ్జనం చేసే ప్రాంతాలు ఇవే..

- నల్లగొండ పరిసర విగ్రహాలను సమీపంలోని భీమ సముద్రం, వల్లభరావు చెరువులో
- మిర్యాలగూడ విగ్రహాలను వాడపల్లి, నాగార్జున సాగర్, అడవిదేవులపల్లి వద్ద కృష్ణానదిలో
- దేవరకొండ పరిసర ప్రాంతాల విగ్రహాలను కొండభీమనపల్లి, పెద్దమునిగల్, డిండి చెరువుల వద్ద నిమజ్జనం చేయనున్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ) : వానాకాలం 2023-24 సీజన్ ధాన్యం కొనుగోలుకు ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వానాకాలం ధాన్యం సేకరణపై వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 6.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని తెలిపారు. ఆయా శాఖలు అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా 274 కేంద్రాల ఏర్పాటుకు ప్రాథమికంగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు, డీఏఓ శ్రవణ్‌కుమార్, డీఆర్‌డీఓ కాళిందని, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు బాబీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని పరిరక్షించాలి

- కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు లేక అవస్థలు పడుతున్నాం
- వానొస్తే వీధులన్నీ బురదమయంగా అవుతున్నాయి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో నీలగిరి మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు ఏకరువు
- సమస్యలు పరిష్కరిస్తాం : కమిషనర్ రమణాచారి



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న నల్లగొండ మున్సిపల్ కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : కాలనీల్లో డ్రైయినేజీలు లేక మురుగు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. శివారు కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో కొద్దిపాటి వానొచ్చినా మట్టి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి.. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు చేరి దుర్వాసన వస్తోంది.. బురద వల్ల దోమలు, ఈగలు, పురుగులు బెడద ఎక్కువగా ఉంది.. పారిశుద్ధ్యాన్ని పరిరక్షించాలి అంటూ నీలగిరి పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన వారు తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నీలగిరి పట్టణంలోని నెలకొన్న సమస్యలపై మంగళవారం 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కెవి.రమణాచారితో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. వివిధ కాలనీలకు చెందిన వారు ఫోన్ ద్వారా చెప్పిన సమస్యలను, వారి కాలనీ పేర్లను కమిషనర్ రమణాచారి నోట్‌బుక్‌లో రాసుకొని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఫోన్ ఇన్‌లో ప్రజలు వెలిబుచ్చిన సమస్యలు, కమిషనర్ చెప్పిన సమాధానాలు వారి మాటల్లోనే..

ప్రశ్న : వారం రోజులుగా ఆర్టీసీ కాలనీకి పారిశుద్ధ్య సిబ్బంది సరిగా రావడంలేదు.
– శంకర్, ఆర్టీసీ కాలనీ

కమిషనర్ : గణపతి నవరాత్రి ఉత్సవాలు ఉన్నందున విగ్రహాల వద్ద ఎక్కువగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయాల్సి ఉండడంతో కొంత ఆలస్యం అవుతోంది. రెండు రోజుల్లోనే ఈ సమస్యను తీరుస్తాం.

ప్రశ్న : ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది.
– మధనాచారి, నందీశ్వరకాలనీ

కమిషనర్ : మున్సిపల్ అధికారులను పంపించి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : 35వ వార్డులో, కనకదుర్గ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీల్లో, శ్రీనగర్ కాలనీలోని ఓ వీధిలో డ్రెయినేజీ, సీసీ రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం.
– గద్దం ప్రభాకర్, సాంబయ్య, సుధాకర్, హఫీజ్, రాంరెడ్డి

కమిషనర్ : ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే, డ్రెయినేజీ, రోడ్లు నిర్మిస్తాం.

ప్రశ్న : సబ్‌స్టేషన్ సమీపంలోని పార్కు వద్ద నీటి పైప్‌లైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది.
– మోనోహర్‌రెడ్డి, నల్లగొండ

కమిషనర్ : మున్సిపల్ సిబ్బందిని పంపించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడతాం.

ప్రశ్న : పాత బస్తీ చౌరస్తా, డీవీకే రోడ్డు ఇంద్రారెడ్డి మిల్లు సమీపంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.
– వహిద్ సుల్తానా, చంద్రారెడ్డి

కమిషనర్ : చట్ట ప్రకారం కుక్కలకు సంతాన రహిత ఆపరేషన్లు చేయిస్తున్నా. రాబోయే రోజుల్లో కుక్కల సంఖ్య తగ్గనుంది.

ప్రశ్న : మునుగోడు రోడ్డు హౌజింగ్ బోర్డు కట్ట సమీపంలో కంపచెట్లు, పిచ్చి చెట్ల వల్ల ఇళ్లలోకి పాములు, పురుగులు వస్తున్నాయి.
– లక్ష్మీనారాయణ

కమిషనర్ : ఆ ప్రాంతం కోర్టు కేసులో ఉన్నది. ప్రత్యక్షంగా పరిశీలించి కేసు లేని ప్రాంతం అయితే చెట్లు తొలగిస్తాం.

ప్రశ్న : వెంకటరమణ కాలనీ నుంచి కనకదుర్గ కాలనీ రోడ్డు గుంతల మయంగా ఉంది.
– కీర్తిసాగర్, వెంకటరమణ కాలనీ

కమిషనర్ : రోడ్డును పరిశీలించి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్రశ్న : 17వ వార్డు గ్రాయత్రి కాలనీ రైల్వే అండర్‌పాస్ వద్ద వర్షపు నీరు నిలిచి దోమలు, ఈగలు వస్తున్నాయి.
– శ్రీనివాస్‌రెడ్డి, గాయత్రినగర్

కమిషనర్ : సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకుపోయి వారితో చర్చిస్తాం. వీలైతే మున్సిపల్ సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్టీసీ కాలనీ వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉన్నందున, అడ్డంగా ఉన్న భవనాన్ని తొలగించి ప్రమాదాలు అరికట్టాలి.
– హరీందర్, సతీష్‌నగర్

కమిషనర్ : మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులను పంపించి రోడ్డును పరిశీలిస్తాం. భవనాలు రోడ్డు మీదకు ఉంటే నోటీస్‌లు ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం.

క్లుప్తంగా

కారు ఢీకొని మహిళ దుర్మరణం

కనగల్: కారు ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన కనగల్ మండల పరిధిలోని తేలకంటిగూడెం స్టేజీ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం ఇస్లాంనగర్ గ్రామానికి చెందిన దండుగుల అనసూర్యమ్మ (55) భర్త మూడేళ్ల క్రితమే మరణించగా.. స్థానికంగా కంకర మిల్లు వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం రాత్రి 8.30గంటల సమయంలో తేలకంటిగూడెంలో తన మనవడి(కుమార్తె కొడుకు)ని చూసేందుకు ఆటోలో వెళ్లింది. తేలకంటిగూడెం స్టేజీ వద్ద అనసూర్యమ్మ ఆటో దిగి కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా అల్టో కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కారును డ్రైవర్ నజీర్ ఘటనా స్థలంలోనే విడిచిపెట్టి పరారయ్యాడు. మృతురాలి కుమారుడు ఏసుబు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నజీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తుర్కపల్లి: బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండల కేంద్రంలోని వాసాలమర్రి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కర్కపట్లకు చెందిన ఉడత చినమల్లుయాదవ్ పని నిమిత్తం సోమవారం భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌లో తన బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. పని ముగించుకొని తిరిగి తన సొంతూరుకు బైక్‌పై వెళ్తుండగా తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చినమల్లుయాదవ్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో అతడిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ తెలియలేదు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి



'గద్దరన్న యాదిలో..' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

కోదాడ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని ఓయూ జేఏసీ నాయకులు డాక్టర్ కందుల మధు, ఎస్ఎం. శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. అక్టోబర్ 1న కోదాడలో నిర్వహించే 'గద్దరన్న యాదిలో..' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం కోదాడలో చాకలి ఐలమ్మ, శ్రీకాంతాచారి విగ్రహాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు పోలంపల్లి బాబు, రేపాకుల నరేష్, మోసిన్, బేగ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లాలే సూత్రధారి..?

- ప్రియుడు, మరికొందరి సహకారంతో భర్త ఊపిరి తీసిన భార్య
- సఖ్యతకు అడ్డొస్తున్నాడనే ఘాతుకం
- వీడుతున్న పూర్యాతండా హత్య కేసు మిస్టరీ
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- హత్యకు సహకరించిన పాత్రధారులపై లోతుగా పోలీసుల విచారణ



భార్య అరుణ, ముగ్గురు పిల్లలతో చాంప్ల (ఫైల్)

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యతండా సమీపంలో శనివారం రాత్రి జరిగిన నూతనకల్ మండలం బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు చాంప్ల హత్య కేసు మిస్టరీ వీడుతున్నట్లు తెలిసింది. సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతోనే హతుడి భార్య అరుణ తన ప్రియుడు, మరికొందరి సహకారంతో ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నూతనకల్ మండలం బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు చాంప్ల(38) తండాలో వ్యవసాయంతోపాటు జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యతండా సమీపంలో గుట్టల వద్ద బొగ్గు బట్టీలు పెడుతూ భార్యా, పిల్లలను పోషించుకుంటున్నాడు.

పథకం ప్రకారమే..

తన సఖ్యతకు భర్త చాంప్ల అడ్డువస్తున్నాడని భార్య అరుణ పథకం ప్రకారం ప్రియుడు, మరికొందరి సహకారంతో హత్య చేసినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి బొగ్గుబట్టీల వద్ద నిద్రిస్తున్న సమాచారాన్ని అరుణ ముందే తన ప్రియుడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అతను మరో ఇద్దరితో కలిసి పూర్యాతండా శివారులోని బొగ్గుబట్టీల వద్దకు వచ్చి కొట్టంలో పడుకున్న చాంప్లపై దాడి చేసి అనంతరం ఒకరు కాళ్లు పట్టుకొని మరికొందరు అతడి మెడకు తాడు బిగించి ఊపిరి ఆడకుండా హత్య చేసిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారని సమాచారం. ఘటనా స్థలంలో అరుణ ధరించిన కొన్ని గాజుల ముక్కలతో పాటు తలకు పెట్టుకున్న పూలు కూడా చాంప్ల మృతదేహం వద్ద రాలిపోయాయి. ఆమె చెవుకు ధరించిన దిద్దును కూడా అక్కడే పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. చాంప్లపై దాడి చేస్తున్న క్రమంలో జరిగిన పెనుగులాటలో అరుణ ధరించిన వస్తువులు కిందపడిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇనుప రాడ్డుతో చాంప్లను కొట్టగా ఒంటిపై గాయాలైనట్లు గిరిజనులు చెబుతున్నారు. వీటికి తోడు హతుడి కుమారుడు ధనుష్ తండావాసుల వద్ద వీడియోలో చెప్పిన మాటలు అరుణపై వస్తున్న ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. హతుడి తల్లి ఫిర్యాదు మేరకు అరుణతో పాటు ఆమె ప్రియుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిసింది.

కీలకం కానున్న కాల్‌డేటా రికార్డు

ఈ హత్య కేసులో అరుణ సెల్‌ఫోన్ కాల్‌డేటా రికార్డు (సీడీఆర్)కీలకం కానున్నట్లు తెలుస్తోంది. హత్యోదంతానికి ముందు అరుణ ఫోన్‌లో ఎవరితో మాట్లాడింది.? ఈ కేసులో అరుణ, ఆమె ప్రియుడితో పాటు ఇంకెంత మంది పాత్రధారులు ఉన్నారు? నిందితులకు పరోక్షంగా సహకరించిన వారెందరు? వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగిందా..? మరో కారణం ఏమైనా ఉందా..? ఇలా అన్ని కోణాల్లో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అరుణ కాల్ డేటా రికార్డు ఆధారంగానే కేసు చిక్కుముడి పూర్తి స్థాయిలో వీడనున్నట్లు తెలుస్తోంది.

ఒంటరైన ముగ్గురు పిల్లలు

చాంప్ల హత్యతో వారి ముగ్గురు పిల్లలు ఝాన్సీ, రోహిత, ధనుష్ ఒంటరయ్యారు. ఝాన్సీ, రోహిత నకిరేకల్ సమీపంలోని గురుకుల పాఠశాలలో 6, 3వ తరగతులు చదువుతున్నారు. ధనుష్ తల్లిదండ్రులతో కలసి ఉంటూ గ్రామంలో ఒకటో తరగతి చదువుతున్నాడు. క్షణిక సుఖానికి భర్తను కడతేర్చి పిల్లలకు తండ్రి లేకుండా చేసిందని, దారుణానికి పాల్పడి తానూ కటకటాల పాలై వారిని అనాథలుగా మార్చిందని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన హేమ్లా తండావాసులు అరుణను తిట్టిపోశారు.

అమ్మ ఫోన్ లాక్కుంది : ధనుష్, హతుడి కుమారుడు

బక్కహేమ్లాతండా వాసులు మంగళవారం చాంప్ల ముగ్గురు పిల్లలను తీసుకొని అర్వపల్లి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ హతుడు చాంప్ల కుమారుడు ధనుష్‌తో మాట్లాడించారు. 'నాన్నను ఎవరో కొడుతుండగా ఆయన కేకలు వేయడంతో నేను నిద్రలేచా. మంచంలో ఉన్న అమ్మ ఫోన్ తీసుకుని తాత మంగ్యాకు ఫోన్ చేయబోయా. అమ్మ తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పడుకో అంటూ నా ముఖంపై చద్దరు కప్పి పడుకోబెట్టింది' అంటూ ఏడేళ్ల బాలుడు తండ్రి హత్య జరిగిన తీరును వివరించడంతో అక్కడున్న వారందరూ కన్నీరుమున్నీరయ్యారు.

నా కూతురును కఠినంగా శిక్షించాలి

– అరుణ తండ్రి కేతావత్ మంగ్యా



తన అల్లుడు చాంప్ల ఎంతో మంచి వాడని, అలాంటి వ్యక్తిని హత్య చేయడం దారుణమని అరుణ తండ్రి కేతావత్ మంగ్యా పేర్కొన్నారు. అర్వపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన అల్లుడిని కూతురు అరుణ కొందరితో కలిసి హత్య చేసినట్లు తెలిసిందని విలపిస్తూ చెప్పాడు. తన అల్లుడు చాంప్లను కూతురు అరుణ చంపినట్లు నిర్ధారణ అయితే కఠినంగా శిక్షించాలని, అందుకు మా కుటుంబం బాధ పడదన్నారు. తాను అనారోగ్యం పాలై ఆస్పత్రిలో ఉంటే తన అల్లుడు చాంప్ల దగ్గర ఉండి నెల రోజులు సేవలందించి బతికించాడని చెబుతూ మంగ్యా బోరుమన్నాడు.

మతిస్థిమితంలేని మహిళ హల్‌చల్

- బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందంటూ గ్రామస్తుల హడావుడి
- పక్కనే డ్రెయినేజీలో దాక్కొని ఉండటంతో ఊపిరి పీల్చుకున్న జనం



కొర్లపహాడ్‌లోని వ్యవసాయ బావి వద్ద గుమిగూడిన గ్రామస్తులు

కేతేపల్లి: మానసిక వికలాంగురాలు అయిన మహిళ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందంటూ గ్రామస్తులు కాసేపు హడావుడి చేశారు. కానీ ఆ మహిళ పక్కనే ఉన్న డ్రెయినేజీలో దాక్కొని ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన కనుతుల అంజమ్మకు కొంతకాలం మానసికస్థితి సరిగా లేదు. దీంతో అంజమ్మ తరచూ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి రోడ్డు వెంట తిరుగుతూ ఉండేది. అప్పుడప్పుడు తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతానంటూ బెదిరిస్తూ ఉండేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్థానిక అంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్ద అంజమ్మ నిలబడి ఉండటాన్ని గమనించిన సమీప నివాస గృహాల వారికి పది నిమిషాల తర్వాత అక్కడి పరిసరాలలో ఆమె కనిపించలేదు. దీంతో అంజమ్మ బావిలో దూకి ఉంటుందని ఆందోళన చెందిన గ్రామస్తులు ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. కేతేపల్లి పోలీసులు, నకిరేకల్ ఫైర్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బావి వద్దకు చేరుకున్నారు. తాళ్ల సహాయంతో ఇనుప కొక్కాలను బావిలోకి అంజమ్మ ఆచూకీ కోసం వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో విద్యుత్ మోటార్లతో బావిలోని నీటిని ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదే సమయంలో మురుగు నీరు, వర్షపు నీరు వెళ్లేందుకు హైవే వెంట నిర్మించిన డ్రెయినేజీలో అంజమ్మ దాక్కొని ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించారు. పోలీసులు డ్రెయినేజీ కాల్వ నుంచి అంజమ్మను బయటకు తీసుకొచ్చి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

29న నకిరేకల్‌కు మంత్రి కేటీఆర్ రాక



నకిరేకల్ మినీ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: పలు అభివృద్ధి పనుల ప్రారంభించేందుకు 29న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నకిరేకల్ నియోజకవర్గానికి విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెల్లడించారు. మంత్రి సభ నిర్వహణ కోసం మంగళవారం సాయంత్రం నకిరేకల్‌లోని మినీ స్టేడియంను ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29న కట్టంగూరు మండలం చెర్వన్నారంలో రూ.101.62 కోట్లతో అయిటిపాముల లిఫ్ట్ పథకానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నకిరేకల్‌లో రూ.5.70 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు నూతనంగా నిర్మించిన ఎస్టీఓ, పీఆర్‌టీయూ, గ్రంథాలయ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కట్టంగూరు ఎంపీపీ ముత్తిలింగం, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు యల్లపురెడ్డి సైదిరెడ్డి, ప్రగడపు నవీన్‌రావు, కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, పల్లె విజయ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



దేవరకొండలో మినీ బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండలో రూ.80లక్షలతో నిర్మించిన మినీ బస్టాండ్‌ను మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి గుత్తా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పనితీరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు ఊహించని విధంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసమే మహిళా బిల్లు ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాల్సి ఉందన్నారు. డీలిమిటేషన్ జరిగిన తర్వాత అమలు చేసే మహిళా రిజర్వేషన్ల కోసం ఇప్పుడు బిల్లు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. బీసీ గణన చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రం రాష్ట్రానికి సహకరించకపోగా చాలా సందర్భాల్లో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన ప్రతిపాదనలు పార్లమెంట్‌లో ఆమోదించగలిగితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు పెంచి అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, వంగాల ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ బాలునాయక్, డిపో మేనేజర్ రాజీవ్‌ప్రేమ్‌కుమార్, కొండ్ర మల్లీశ్వరిశ్రీశైలంయాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, రయీస్, జయప్రకాష్, కేసాని లింగారెడ్డి, టీవీఎన్ రెడ్డి, శిరందాసు కృష్ణయ్య, పొన్నెబోయిన సైదులు, చీదెళ్ల వెంకటేశ్వర్లు, రాజినేని వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐలమ్మ సాహసమే తెలంగాణ సమాజానికి స్ఫూర్తి

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల, సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరనారి చాకలి ఐలమ్మ సాహసమే తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకట్రావుతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించి మాట్లాడారు. సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ఆమె చూపించిన తెగువ తెలంగాణకు గుర్తింపు తెచ్చిందని కొనియాడారు. ఐలమ్మ స్ఫూర్తితోనే రాష్ట్రంలో కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ పోరాటయోధులకు సముచిత గౌరవం లభించిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ అన్నపూర్ణమ్మ, జెడ్పీటీసీ జీడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గురువింద తీరుగా గవర్నర్ వ్యవహారం..

సూర్యాపేట రూరల్: ఎమ్మెల్సీల తిరస్కరణపై గవర్నర్ తమిళిసై చెబుతున్న సాకులు గురువింద సామెతను గుర్తుకు తెస్తున్నాయని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మండల పరిధిలోని జనగామ క్రాస్‌రోడ్డు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీల విషయంలో తప్పుడు నిర్ణయం తీసుకున్న గవర్నర్ సెల్ఫ్ గోల్ చేసుకున్నారన్నారు. గవర్నర్ అయ్యే సమయానికి ఆమె తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్నారని, పదవి ప్రకటన తర్వాత అధ్యక్షురాలిగా రాజీనామా చేశారని గుర్తుచేశారు. నిష్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకుంటానని గవర్నర్ వ్యాఖ్యానించడం అర్థరహితమన్నారు. బీజేపీ నుంచి గవర్నర్‌గా వచ్చి ఎదుటి వారిని పార్టీ పేరుతో తిరస్కరించడం సమంజసం కాదన్నారు. గవర్నర్ చెప్పే లెక్క ఆమెకూ వర్తిస్తుందన్నారు. తిరస్కరణ నీతితో ఆమె కూడా గవర్నర్ పదవికి అర్హురాలు కాకుండా పోతారన్నారు.

సత్రశాలలో పెళ్లి.. హయత్‌నగర్‌లో వదిలి

- బాలికను కిడ్నాప్ చేసిన నలుగురు యువకుల రిమాండ్



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ

మిర్యాలగూడ టౌన్: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్న యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 22వ తేదీన ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన చరణ్‌దీప్ తన తమ్ముడు శరత్‌తో పాటు అతడి మిత్రులు అంజి, మహేష్ కలిసి బాలికను బైక్‌పై ఎక్కించుకొని అడవిదేవులపల్లి మండల సమీపంలో ఆంధ్రప్రదేశ్‌లోని సత్రశాలకు తీసుకెళ్లారు. అక్కడ బాలికను చరణ్‌దీప్ వివాహం చేసుకున్నాడు. బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. దీంతో భయపడిన బాలిక నాన్న దగ్గరికి వెళ్తానని అనడంతో రంగారెడ్డి జిల్లా పరిధిలోని హయత్‌నగర్‌లో వదిలివేశారు. హయత్‌నగర్ బస్టాండ్ వద్ద బాలికను తల్లిదండ్రులు, పోలీసులు గుర్తించి ఇంటికి తీసుకొచ్చారు. బాలికను తీసుకెళ్లిన నలుగురు యువకులపై పోక్సో, నిర్భయ, అత్యాచారం, కిడ్నాప్ కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న నలుగురు యువకులు మిర్యాలగూడ పట్టణ సమీపంలోని అవంతీపురంలో ఉన్నట్లు తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు మంగళవారం వారిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేశారు. నిందితులను పట్టుకున్న కానిస్టేబుల్ నాగయ్య, హోంగార్డు గోపిని సీఐ అభినందించారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తదితరులున్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. పలువురికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యులు

హుజూర్‌నగర్: ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోదాడ నుంచి మిర్యాలగూడకు వస్తుండగా.. హుజూర్‌నగర్‌లోని కొత్త బస్టాండ్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ని ఢీకొట్టింది. దీంతో బస్సులోని 14మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. బస్సు కండక్టర్ ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



తేజు

హాలియా: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో బుధవారం నుంచి అక్టోబర్ 8 వరకు జరిగే జాతీయస్థాయి సబ్–జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు హాలియాకు చెందిన చింతలచెర్వు తేజు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 20 రోజుల నుంచి తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో తేజు అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. తేజు ప్రస్తుతం చండూరు గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ గురుకుల ఫుట్‌బాల్ అకాడమీ కోచ్ లింగయ్యనాయక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య, తల్లిదండ్రులు శ్రీను, లలిత ప్రోత్సాహంతో తేజు జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు తెలిపారు.

ఫార్మా రంగంలో ప్రత్యేక స్థానం

- యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ రాబర్ట్ ఎం. కాలిఫ్



దివీస్ పరిశ్రమను సందర్శించిన యూఎస్ఎఫ్‌డీఏ ప్రతినిధి బృందం

చౌటుప్పల్: ఫార్మాస్యూటికల్ రంగంలో దివీస్ పరిశ్రమకు ప్రత్యేక స్థానం ఉందని యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ రాబర్ట్ ఎం.కాలిఫ్, భారత్ డైరెక్టర్ డాక్టర్ సారా మెక్‌ముల్లెన్ అన్నారు. అన్నిరకాల నియమ నిబంధనలు పాటిస్తూ ప్రపంచ వ్యాప్తంగా వందకు పైగా దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయడం ద్వారా దివీస్ పరిశ్రమ తనదైన ముద్రను వేసుకుందని కొనియాడారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో గల దివీస్ లేబోరేటరీస్ లిమిటెడ్ సంస్థను యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్ (ఏపీఐ) పరిశ్రమ పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీ ఏకీకరణ, రసాయన శాస్త్రంలో స్థిరమైన పద్ధతులు, తయారీ ప్రమాణాలను పెంచడం, ఏపీఐ లభ్యతలను నిర్ధారించడం వంటి అంశాలను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రపంచస్థాయి భారీ ఉత్పత్తి సౌకర్యాలు, అధునాతన ఆటోమేటెడ్ తయారీ సామర్థ్యాలు, సరికొత్త ఆవిష్కరణల పట్ల కంపెనీ నిబద్ధతను బృందం అభినందించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివీస్‌లో అన్ని రకాల ప్రమాణాలు పాటిస్తున్నారన్నారు. తక్కువ సమయంలోనే భారీస్థాయిలో ఉత్పత్తి చేయడం, సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దివీస్ పరిశ్రమ సీఈఓ డాక్టర్ కిరణ్.ఎస్.దివి మాట్లాడుతూ.. యూఎస్ఎఫ్‌డీఏ ప్రతినిధి బృందం తమ పరిశ్రమను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఫార్మాస్యూటికల్ రంగాన్ని ప్రభావితం చేసే క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో తాము పాలుపంచుకుంటామని తెలిపారు.

తక్కెళ్లపహాడ్‌లో ఉద్రిక్తత



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగిన తక్కెళ్లపల్లి గ్రామస్తులు



స్పృహతప్పి పడిపోయిన మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

- డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశించిన గ్రామస్తులను ఖాళీ చేయించిన పోలీసులు
- పోలీసులు, ప్రజలకు మధ్య తోపులాట
- స్పృహతప్పి పడిపోయిన మహిళ

శాలిగౌరారం: మండలంలోని తక్కెళ్లపహాడ్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామానికి చెందిన ఇళ్లులేని దళితులు, బీసీలు గ్రామంలో నిర్మించి పంపిణీకి సిద్ధంగా ఉన్న 28 డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వారం క్రితం అక్రమంగా ప్రవేశించి నివాసం ఉంటున్నారు. శాలిగౌరారం సీఐ రాఘవరావు నేతృత్వంలో పోలీసులు మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి అక్రమంగా ప్రవేశించిన వారిని ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. ఇళ్లలో నుంచి సామాన్లను బయటపెట్టి తాళాలు వేసేందుకు ప్రయత్నించగా ప్రజలు ప్రతిఘటించారు. ఈ క్రమంలో పోలీసులు, ప్రజలకు మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న మహిళా పోలీసులు ప్రతిఘటిస్తున్న మహిళలను బలవంతంగా బయటకు లాగారు. ఈ క్రమంలో ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. దీంతో ఆమెను 108 వాహనంలో శాలిగౌరారం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం పోలీసులు ప్రజలను నిలువరించి ఇళ్లలోని సామాన్లను బయట పెట్టి ఇళ్లకు తాళాలు వేశారు. తమపై మహిళా పోలీసులతో పాటూ పురుష పోలీసులు కూడా దాడి చేశారంటూ మహిళలు ఆరోపించారు. పోలీసులు తమ వాహనాలను బయటకు తీసేందుకు యత్నించగా ప్రజలు అడ్డుపడ్డారు. ఘటనా స్థలానికి వచ్చిన తహసీల్దార్ పాల్‌సింగ్, సీఐ రాఘవరావు వారికి నచ్చజెప్పేందుకు ఎంత ప్రయత్నించినా వారు వినలేదు. చివరకు రెండు వారాల్లోగా గ్రామంలో గ్రామసభ నిర్వహించి అర్హులైన పేదలను గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.

అర్హులకే ఇళ్లు ఇస్తాం

రెండు వారాల్లోగా గ్రామసభ నిర్వహించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అప్పగిస్తాం. అప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి అక్రమంగా ఒక్కరు కూడా ప్రవేశించొద్దు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం మంజూరు చేసిన వారికి మాత్రమే ఇళ్లలోకి ప్రవేశం ఉంటుంది.

– పాల్‌సింగ్, తహసీల్దార్